
ఇనుప బొంగులను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఈడబ్ల్యూఎస్ కాలనీ పార్కులో ఇనుప బొంగుల తొలగింపు

అమీర్‌పేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌నగర్ ఈడబ్ల్యూఎస్ కాలనీ పార్కులో షెడ్డు నిర్మించేందుకు స్థానిక నివాసితుల సంక్షేమ సంఘం పార్కు చుట్టూ నాటిన ఇనుప బొంగులను మంగళవారం అమీర్‌పేట రెవెన్యూ అధికారులు తొలగించారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఈ పార్కు భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని తహసీల్దార్ పద్మ సుందరి ఆదేశాల మేరకు అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్నట్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ తెలిపారు. తొలగించిన ఇనుప బొంగులను సిబ్బందితో రెవెన్యూ కార్యాలయానికి తరలించారు.


అమీర్‌పేటలో పర్యటిస్తున్న సంగీతాశ్రీనివాస్ యాదవ్, అధికారులు

ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించాలి

- కార్పొరేటర్ వనం సంగీతాశ్రీనివాస్‌యాదవ్

బంజారాహిల్స్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్ ఆక్రమణల వల్ల రోడ్లు ఇరుకుగా మారి ప్రయాణికులకు, స్థానికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వెంటనే వాటిని తొలగించాలని సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీతశ్రీనివాస్ యాదవ్ కోరారు. అమీర్‌పేట, ఎల్లారెడ్డిగూడ, నవోదయకాలనీ, గణపతి కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఆమె జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పర్యటించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎల్లారెడ్డిగూడ నుంచి అమీర్‌పేట చౌరస్తా వరకు ఉన్న రోడ్డు ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్ సజావుగా సాగేలా చూడాలని అధికారులకు సూచించారు. శ్రీనగర్‌కాలనీ డీ టైపు పార్కులో పచ్చదనం అభివృద్ధి కోసం మొక్కలు నాటాలని కోరారు. గణపతి కాంప్లెక్స్, అప్సర అపార్ట్‌మెంట్ ఆనుకొని ఉన్న ఖాళీ స్థలంలో చెత్త వేయడంతో పాటు అక్రమ పార్కింగ్ కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.


హన్మంతరావును సన్మానిస్తున్న టీచర్లు, విద్యార్థులు

హన్మంతరావుకు స్ఫూర్తి పురస్కారం

యూసుఫ్‌గూడ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): యూసుఫ్‌గూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదవతరగతి విద్యార్థులు గణితంలో వందశాతం ఉత్తీర్ణత సాధించారు. దీంతో గణితం ఉపాధ్యాయుడు హన్మంతరావు ఉత్తమ స్ఫూర్తి పురస్కారం అందుకున్నారు. మంగళవారం పాఠశాలలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు పి.పరమేశ్వరమ్మ మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించడంతో పాటు పాఠశాల అభివృద్ధికి హన్మంతరావు కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో శ్రీవాత్సవ, టీచర్లు పాల్గొన్నారు.

బల్కంపేట ఎల్లమ్మకు పూలతో అలంకారం

అమీర్‌పేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బల్కంపేట ఎల్లమ్మను రోజుకో విధంగా అలంకరిస్తున్నారు. మంగళవారం అమ్మవారి మూల విరాట్‌లు, గర్భగుడిని కలువా, గులాబీ, చామంతి పూలతో సుందరంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.


పూలతో అలంకృతురాలైన బల్కంపేట ఎల్లమ్మ

బోరబండలో నాకాబందీ

- సరైన పత్రాలు లేని 63 వాహనాలకు చలాన్లు

బోరబండ, సెప్టెంబరు 9 (ఆంధ్ర జ్యోతి): బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసు ఉన్నతాధికారులు నాకాబందీ నిర్వహించారు. బోరబండ సైట్-3 కాలనీ పీలీదర్గా వద్ద జరిగిన నాకాబందీలో వెస్ట్ జోన్ డీసీపీ ఎస్.ఎం.విజయ్ కుమార్, అదనపు డీసీపీ గోవర్ధన్, ఎస్ఆర్‌నగర్ ఏసీపీ రాఘవేంద్రరావు, బోరబండ ఎస్‌హెచ్‌ఓ ఎం.సురేందర్, డీఐజీ సైదులు, ఎస్ఐ శేరి స్వప్నారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. సరైన పత్రాలు లేని 63 వాహనాలకు చలాన్లు విధించారు.

'శిశువిహార్ చిన్నారులకు అమ్మపాలు సరఫరా చేయాలి'

పంజాగుట్ట, సెప్టెంబరు 9 (ఆంధ్ర జ్యోతి): యూసుఫ్‌గూడ ప్రధాన రహదారి రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యాలయం ఆవరణలో ఉన్న శిశు విహార్‌లోని చిన్నారులకు కూడా ధాత్రి మదర్స్ మిల్క్ బ్యాంక్ ద్వారా అమ్మపాలు సరఫరా చేయాలని తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సూచించారు. మంగళవారం మధురానగర్‌లోని కమిషన్ కార్యాలయంలో సభ్యులు వచన్ కుమార్, వందనగౌడ్, అపర్ణ, ప్రేమలత అగర్వాల్‌ను సుశేన హెల్త్ ఫౌండేషన్ డైరెక్టర్ కాశీనాథ్, కార్యదర్శి సంతోష్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా నెలకొల్పిన ధాత్రి మదర్స్ మిల్క్ బ్యాంక్ గురించి కమిషన్ సభ్యులకు వివరించారు.

భవిష్యత్‌లో రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని మదర్స్ మిల్క్ బ్యాంక్‌లను ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో ఏర్పాటు చేయాలని, ప్రతి శిశువుకూ తల్లిపాలు అందేలా చర్యలు తీసుకోవాలని కమిషన్ పేర్కొందని, ఆ దిశగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నామని ఫౌండేషన్ డైరెక్టర్ కాశీనాథ్ తెలిపారు. సమావేశంలో సీపీడీవోలు రమణాచారి, షబానా, చంద్రనేశ్వరి పాల్గొన్నారు.

ఇందిర క్యాంటీన్లు.. మహిళలకు చేదోడు..!

- గ్రేటర్‌లో 33 క్యాంటీన్లు ఏర్పాటు
- త్వరలో మరికొన్ని

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మహిళలను కోటీశ్వరులను చేయాలనే ప్రభుత్వ లక్ష్యం మేరకు గ్రేటర్‌లో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు విజయవంతంగా నడుస్తున్నాయి. స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ఇప్పటి వరకు నగరంలో 33 క్యాంటీన్లు ఏర్పాటు చేశారు. త్వరలో మరిన్ని క్యాంటీన్లు అందుబాటులోకి వస్తాయని అధికారులు చెబుతున్నారు. జీహెచ్ఎంసీ కేంద్ర, జోనల్, సర్కిల్ కార్యాలయాల్లో క్యాంటీన్లు నిర్వహిస్తున్నారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో రూ.5 లక్షల బ్యాంక్ రుణంతో నందినగర్‌కు చెందిన స్నేహిత స్వయం సహాయక సంఘం ఆధ్వర్యంలో మార్చిలో ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి ప్రారంభించారు. సంస్థలోని ఉద్యోగులు, సందర్శకులు, బీఆర్‌కేఆర్ భవన్‌లోని వివిధ విభాగాల ఉద్యోగులకు క్యాంటీన్‌లో భోజనం, టిఫిన్లు అందుబాటులో ఉన్నాయి. క్యాంటీన్ ఏర్పాటుతో తమకు ఆర్థిక స్వావలంబన దక్కిందని, తమ కాళ్లపై తాము నిలబడగలమనే ధైర్యం వచ్చిందని వసంత అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.


క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి (ఫైల్)

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మంత్రులు తుమ్మల, వివేక్‌వెంకటస్వామి

బోరబండ, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి కార్యక్రమాలు జరగడంతోపాటు సంక్షేమ పథకాలు సమర్థంగా అమలవుతాయని రాష్ట్ర మంత్రులు వివేక్‌వెంకటస్వామి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రహ్మత్ నగర్ డివిజన్ పరిధిలోని వివిధ బస్తీలలో రూ. 2.31 కోట్ల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శ్రీరామ్‌నగర్‌లో మంగళవారం వారు శంకుస్థాపన చేసిన అనంతరం మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ రాష్ట్ర ప్రభుత్వం క్రమంగా నెరవేరుస్తుందని తెలిపారు. రహ్మత్ నగర్ డివిజన్‌లో అభివృద్ధి పనుల కోసం రూ.20కోట్లు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర రహదారుల అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, మాజీ ఎంపీ ఎం.అంజన్ కుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బి.భవానీశంకర్, వి.నవీన్ యాదవ్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వై.వెంకటస్వామి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్ యాదవ్, గ్యార నాగరాజు, శివ, అంతయ్య, అండాలు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణతో విదేశాల్లో ఉపాధి

బంజారాహిల్స్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఓవరసీస్ మ్యాన్‌పవర్ పథకం కింద శిక్షణ పొందిన 18 మంది ఎలక్ట్రీషియన్లు జర్మనీలో ఉద్యోగానికి ఎంపికయ్యారని కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి తెలిపారు. మంగళవారం సచివాలయంలో వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇండో యూరో సింక్రనైజేషన్(ఐఈఎస్) సంస్థ వీరికి ఆరు నెలల పాటు శిక్షణ ఇచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్, ఇండో యూరో సింక్రనైజేషన్ సీఈవో డాక్టర్ బంగారు రాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1 ఫలితాలపై హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు

పంజాగుట్ట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 ఫలితాలపై హైకోర్టు తీర్పు రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదని పలువురు నిరుద్యోగులు అన్నారు. స్థానికసంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. లేకపోతే స్థానిక ఎన్నికల్లో తమ సత్తా ఏమిటో కాంగ్రెస్ ప్రభుత్వానికి చూపుతామని హెచ్చరించారు. ఆర్థిక శాఖ అనుమతి ఇచ్చినా నోటిఫికేషన్లు ఎందుకు ఇవ్వడం లేదు, ఖాళీలు ఎందుకు భర్తీ చేయడం లేదని వారు ప్రశ్నించారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో 'రెండు లక్షల ఉద్యోగాల సాధన కోసం నిరుద్యోగుల పోరుబాట' అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. జేఏసీ అధ్యక్షుడు మోతీలాల్ నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. నిరుద్యోగ యువత మీద రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని మండిపడ్డారు. స్థానికసంస్థల ఎన్నికలకు ముందే ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలన్నారు. ఉద్యోగాల కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఝాన్సీ, ఎడపాక రవి, బండారి రాజు, కృష్ణమూర్తి, ఉమ, వర్ధన్, గోపీచంద్, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో తెలంగాణ నిరుద్యోగ జేఏసీ ప్రతినిధులు

ఎస్సీ వర్గీకరణ రద్దు చేయాల్సిందే


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్

పంజాగుట్ట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ చెల్లదని, దళితుల ఐక్యతపై దేశవ్యాప్త రాజకీయ కుట్ర అని, వర్గీకరణను రద్దు చేయాల్సిందేనని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్.ఎస్ రత్నాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ కుట్రపూరితంగా చేసిన వర్గీకరణకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమం చేపడుతున్నామన్నారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలకే పరిమితమైన తమ ఉద్యమం దేశవ్యాప్తంగా విస్తరిస్తోందన్నారు. దళితులలో తాము ఎవరికీ వ్యతిరేకం కాదని, వర్గీకరణ పేరుతో అన్ని పార్టీలు మాల సమాజాన్ని అణగాదొక్కాయని ఆరోపించారు. బీజేపీ కుట్ర చేస్తోందని, మాల జాతి ఐక్యతను కాపాడుకుందుకు ప్రతీ ఒక్కరూ ముందుకు వచ్చి ఐక్య పోరాటం చేయాలని అన్నారు. ఉమ్మడి ఏపీలో వర్గీకరణ చెల్లదని సుప్రీంకోర్టు తీర్పు చెప్పిందని, ఇప్పుడు ఎలా చెల్లుతుందని ప్రశ్నించారు. ఈ సందర్భంగా నగరానికి చెందిన గడ్డం సత్యనారాయణను మాల మహానాడు జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమిస్తున్నట్టు ఆయన ప్రకటించారు. సమావేశంలో తెలంగాణ కన్వీనర్ బల్లెం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, సూరిబాబు పాల్గొన్నారు.

భూ భారతి అమలులో భాగంగా చేపట్టిన శిక్షణలో అన్యాయం

పంజాగుట్ట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన భూ భారతి అమలులో భాగంగా చేపట్టిన లైసెన్స్ సర్వేయర్స్ సిస్టం(ఎల్ఎస్ఎస్) శిక్షణ, పరీక్షలు, అప్రెంటిస్‌షిప్‌లో తమకు అన్యాయం జరిగిందని తెలంగాణ రాష్ట్ర ఎల్.ఎస్.ఎస్, లైసెన్స్‌డ్ సర్వేయర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు అన్నారు. డబ్బులు తీసుకుని అరకొర వసతులతో తమకు శిక్షణ ఇచ్చారని అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నరేష్ చాగంటి, అధ్యక్షుడు నగారా రమేష్ ఆరోపించారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం డబ్బులు చెల్లించి తాము శిక్షణలో చేరామని మొదటి విడతలో వివిధ జిల్లాలలో ఏడు వేల మందికి అరకొర శిక్షణ ఇచ్చారని, ప్రస్తుతం తాము అప్రెంటిస్‌షిప్ చేస్తున్నామని, ప్రస్తుతం రెండో విడతలో మూడు వేల మంది శిక్షణ పొందుతున్నారని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌లో శిక్షణ పొందిన తర్వాత నెలకు సుమారు రూ. 30 వేల వరకు ఆదాయం వస్తుందని చెప్పారన్నారు. డిజిటల్ సర్వే పరికరాల గురించి రెండు రోజులు డెమో మాత్రమే ఇచ్చారని, ఫీల్డ్ ప్రాక్టికల్స్, ప్రాజెక్టులు పూర్తి స్థాయిలో జరగలేదని, తాము సొంతంగా మెటీరియల్ చదువుకుని నేర్చుకోవాల్సి వచ్చిందని అన్నారు. తాలిమ్ సిలబస్‌కు విరుద్ధంగా థియరీ, ప్లాటింగ్ ప్రశ్నాపత్రాలు తయారు చేశారని ఆరోపించారు. అందులో కూడా తప్పులు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. శిక్షణ లోపాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఎల్ఎస్ఎస్‌కు సంబంధించిన స్పష్టమైన జీవో విడుదల చేయాలని, తమకు డిజిటల్ పరికరాలతో శిక్షణ ఇప్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహేష్ కుమార్, ఉపాధ్యక్షులు డి.శ్రీనివాస్, నాగరాజు, రమేష్ నాయక్, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

కాళోజీ రచనలు సమాజానికి మార్గదర్శకం


కాళోజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్


కాళోజీ జయంతిలో కమాండెంట్ మురళీకృష్ణ, పోలీస్ అధికారులు


హైడ్రా కార్యాలయంలో నివాళులర్పించిన కమిషనర్ రంగనాథ్


కాళోజీ నారాయణరావు జయంతి వేడుకల్లో నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, సిబ్బంది

నిమ్స్/యూసుఫ్‌గూడ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజాకవి కాళోజీ ఆలోచనలు, రచనలు సమాజానికి మార్గదర్శకమని నిమ్స్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప అన్నారు. మంగళవారం కాళోజీ నారాయణరావు 111వ జయంతి సందర్భంగా నిమ్స్ ఆస్పత్రి లెర్నింగ్ సెంటర్‌లో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డా.బీరప్ప మాట్లాడుతూ కాళోజీ సిద్ధాంతాలు భావి తరాలను ఆలోచింపజేస్తాయన్నారు. కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ లిజారాజశేఖర్, మెడికల్ సూపరింటెండెంట్ నిమ్మ సత్యనారాయణ, అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ కృష్ణారెడ్డి, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ శాంతివీర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాకేష్, వీఆర్వో సత్యగౌడ్, ఫైనాన్స్ కంట్రోలర్ మోహన్, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు సుజాత, దయాకర్, ఉమేష్, ఉద్యోగ సంఘం నాయకులు పాల్గొన్నారు. యూసుఫ్‌గూడ బెటాలియన్‌లో కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి పలువురు పోలీస్ అధికారులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమాండెంట్ పి.మురళీకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఉద్యమ ప్రతి ధ్వనిగా కాళోజీ పనిచేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ టి.నరేందర్‌సింగ్, అసిస్టెంట్ కమాండెంట్‌లు రాంబాబు, అప్పారె, భాస్కర్, కేవీవీ ప్రసాద్, నర్సింహ, ఆర్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి తరానికి స్ఫూర్తిదాయకం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాళోజీ కవిత్వం నేటితరానికి స్ఫూర్తిదాయకమని మాజీ వీసీ ప్రొఫెసర్ ఎస్‌వీ సత్యనారాయణ అన్నారు. కాళోజీ 111వ జయంతి పురస్కరించుకుని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో మంగళవారం స్మారకోపన్యాసం నిర్వహించారు. 'తెలంగాణా విమోచనోద్యమం - కాళోజీ కవిత్వం' అనే అంశంపై ఎస్‌వీ సత్యనారాయణ ప్రసంగించారు. కాళోజీ తన జీవితం మొత్తం సమాజాభివృద్ధికే పాటుపడ్డారని, తాను నమ్ముకున్న సిద్ధాంతం కోసమే చివరి వరకు పరితపించారని పేర్కొన్నారు. ఆయన ఎన్నో సామాజిక ఉద్యమాల్లో పాల్గొన్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ పుష్పాచక్రపాణి, తెలుగు విభాగాధిపతి ఎన్.రజని, రిజిస్ట్రార్ డా.ఎల్వీకే రెడ్డి, ప్రొ. ఆనంద్ పవార్, ప్రొ. వడ్డాణం శ్రీనివాస్, ప్రొ. పల్లవీ కాబడే పాల్గొన్నారు.

సీఎం ప్రజావాణికి 311 దరఖాస్తులు

బేగంపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబాఫూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణికి 311 దరఖాస్తులు వచ్చాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలకు 76, ఇందిరమ్మ ఇళ్ల కోసం 85, రెవెన్యూ 50, ప్రవాసీ ప్రజావాణికి 3, ఇతర శాఖలకు సంబంధించి 97 దరఖాస్తులు అందినట్లు నోడల్ అధికారి దివ్యదేవరాజన్ తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని కోరుతూ కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని పోరండ్ల గ్రామానికి చెందిన దళిత వితంతువు పార్నంది వజ్రమ్మ ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. తాను ప్రస్తుతం ఉంటున్న ఇల్లు శిథిలావస్థకు చేరి కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. తమ గ్రామంలో 31 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా అన్ని అర్హతలు ఉన్న తనకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించలేదని ఆమె వినతిపత్రంలో పేర్కొన్నారు.

'ప్రభుత్వ కార్యాలయాల్లో పెరిగిన అవినీతి'

పంజాగుట్ట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమానికి, రాష్ట్ర పురోగతికి అవినీతి, చెడు పాలన అడ్డంకిగా మారాయని సిటిజన్ ఫోరం తెలంగాణ, జన్ సేవా సంఘ్, అభిప్రాయ్ సంస్థలు ఆందోళన వ్యక్తం చేశాయి. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయా సంస్థల ప్రతినిధులు వీడీ చౌబే, సీతారాం ఠాకూర్, మదన్ లాల్.ఆర్, గోపీనాథ్, రాజీవ్ చౌబే, విజయలక్ష్మి, ఎల్ఎం చౌదరి మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి పెరిగిపోయిందని, ఏసీబీ నమోదు చేసిన వందలాది కేసులు న్యాయస్థానంలో అపరిష్కృతంగా ఉన్నాయని తెలిపారు. వివిధ విభాగాల హెల్ప్‌లైన్‌లు పనిచేయవని, సిటిజన్ చార్టర్‌లు కేవలం అలంకార ప్రాయంగా మారాయని అన్నారు. సీఎం, మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులకు లేఖలు రాసినా స్పందన లేదని అన్నారు. సమావేశంలో ఆయా సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

గురుమూర్తినగర్ ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు

అమీర్‌పేట, సెప్టెంబరు 9 (ఆంధ్ర జ్యోతి): గురుమూర్తి నగర్ చిన్న గురుద్వార సమీపంలోని 315 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో మంగళవారం ఉదయం 7:30 గంటలకు అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీనికి బిగించిన కేబుళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సకాలంలో సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. విద్యుత్ సిబ్బంది కాలిపోయిన కేబుళ్లను తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు మూడు గంటలపాటు శ్రమించినట్లు ఏఈ మౌనిక తెలిపారు.


ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

నకిలీ వైద్యుడి అరెస్ట్

బంజారాహిల్స్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నకిలీ వైద్యుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. కృష్ణానగర్‌లో వెంకటేశ్వరరావు అనే వ్యక్తి ఆర్ ఎంపీ డాక్టర్‌గా సాయి క్లినిక్ పెట్టి వైద్యం చేస్తున్నాడు. ఆరు నెలల క్రితం అనారోగ్యంతో మరణించాడు. ఆయన స్థానంలో బీ ఫార్మసీ చదివిన మణికంఠ వైద్యం చేస్తున్నాడు. సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు దాడులు నిర్వహించి మణికంఠను అరెస్ట్ చేశారు. రూ. 5,600 నగదు సీజ్ చేశారు.


మణికంఠ

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

బోరబండ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధి శ్రీరామ్ నగర్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకొని గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరామ్‌నగర్‌లోని ఎండీ.ముజీబ్ ఇంటి వద్ద దాదాపు 50ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి తరచూ పడుకునే వాడు. ఎంత వారించినా వినేవాడు కాదు. మూడు రోజుల క్రితం అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో ఉండగా ముజీబ్ 100కు డయల్ చేశాడు. అంబులెన్స్ సిబ్బంది వచ్చి అతడు మృతిచెందినట్లు ప్రకటించారు. మృతదేహాన్ని బోరబండ పోలీసులు గాంధీ మార్చురీకి తరలించారు. సంబంధీకులు బోరబండ పోలీస్ స్టేషన్‌లోగాని, ఎస్ఐ మధుసూదన్‌ను 8712549740లోగాని సంప్రదించాలని పోలీసులు సూచించారు.


గుర్తు తెలియని మృతదేహం



క్షీరాభిషేకం

దేశ ప్రజలకు జీఎస్‌టీ తగ్గిస్తామని ప్రధాని ప్రకటించడంతో మంగళవారం అడ్డగుట్ట డివిజన్‌లో బీజేపీ అడ్డగుట్ట డివిజన్ అధ్యక్షురాలు గాజుల సౌందర్య ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు సాయన్న శ్రీధర్, లక్ష్మణ్, కృష్ణ, కళావతి, హంసరాజు, వీరేశం, శిలింగం, శ్రావణ్, రమేష్, స్వామి, సాయి పురుషోత్తంలు పాల్గొన్నారు.

- అడ్డగుట్ట, ఆంధ్రజ్యోతి



లబ్ధిదారులకు ఎల్‌ఓసీ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

ఎల్‌ఓసీ పత్రాల అందజేత

మారేడుపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నిమ్స్ ఆస్పత్రిలో వైద్య ఖర్చుల కోసం మొండా డివిజన్ అంబేద్కర్‌నగర్‌కు చెందిన గణపాక ప్రభాకర్ రూ2 లక్షల 50 వేలు, మల్కాజిగి జెయల్‌ఎస్‌ఎస్ నగర్‌కు చెందిన ముదావత్ శ్రీను నాయక్‌కు రూ.1 లక్ష మొత్తం రూ.4 లక్షల విలువ గల రెండు ఎల్‌ఓసీలు మంజూరయ్యాయి. వీటిని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ మంగళవారం ఎమ్మెల్యే నివాసంలో వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.

పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

19న రవీంద్రభారతిలో జరిగే దళిత జర్నలిస్టు ఫోరం పదో రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను మంగళవారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ ఆవిష్కరించారు. దళిత జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర నాయకులు రాములు, ఉపాధ్యక్షుడు మీసాల ఎల్లేష్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు దొమ్మాట శివకుమార్, కార్యవర్గ సభ్యులు యాదగిరి, రఘురాజు, శ్రీకాంత్, రవిశంకర్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ రద్దు చేయాల్సిందే

● మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్‌ఎస్ రత్నాకర్

పంజాగుట్ట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ చెల్లదని, దళితుల ఐక్యతపై దేశవ్యాప్త రాజకీయ కుట్ర అని, వర్గీకరణను రద్దు చేయాల్సిందేనని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్.ఎస్ రత్నాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ కుట్రపూరితంగా చేసిన వర్గీకరణకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమం చేపడుతున్నామన్నారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలకే పరిమితమైన తమ ఉద్యమం దేశవ్యాప్తంగా విస్తరిస్తోందన్నారు. దళితులలో తాము ఎవరికీ వ్యతిరేకం కాదని, వర్గీకరణ పేరుతో అన్ని పార్టీలు మాల సమాజాన్ని అణగాదొక్కాయని ఆరోపించారు. బీజేపీ కుట్ర చేస్తోందని, మాల జాతి ఐక్యతను కాపాడుకుందుకు ప్రతీ ఒక్కరూ ముందుకు వచ్చి ఐక్య పోరాటం చేయాలని అన్నారు. ఉమ్మడి ఏపీలో వర్గీకరణ చెల్లదని సుప్రీంకోర్టు తీర్పు చెప్పిందని, ఇప్పుడు ఎలా చెల్లుతుందని ప్రశ్నించారు. ఈ సందర్భంగా నగరానికి చెందిన గడ్డం సత్యనారాయణను మాల మహానాడు జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమిస్తున్నట్టు ఆయన ప్రకటించారు. సమావేశంలో తెలంగాణ కన్వీనర్ బల్లెం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, సూరిబాబు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గాంధీ ఆస్పత్రి నుంచి మహిళ అదృశ్యం



క్రిష్ణమ్మ

బౌద్ధనగర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గాంధీ ఆస్పత్రి నుంచి ఓ మహిళ అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వికారాబాద్ జిల్లా తాండూరు అల్లాపూర్‌కు చెందిన నాగప్పకు అనారోగ్యంగా ఉండటంతో చికిత్స నిమిత్తం 3వ తేదీన గాంధీ ఆస్పత్రిలో చేర్పించారు. భర్త నాగప్పకు సహాయకురాలిగా భార్య జి.క్రిష్ణమ్మ(42)ను ఆస్పత్రిలో ఉంచారు. 8వ తేదీ మధ్యాహ్నం 3.15 నిమిషాలకు క్రిష్ణమ్మ ఆస్పత్రి నుంచి అదృశ్యమైంది. ఆమె కోసం పలుచోట్ల గాలించిన ఫలితం లేకపోవటంతో సోమవారం రాత్రి తన తల్లి కనిపించటంలేదని కుమారుడు జి.రాజు చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



రెజిమెంటల్‌బజార్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మోండా డివిజన్ జీహెచ్‌ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న హై రైజ్ బారియర్ రైల్వే బ్రిడ్జి వద్ద ఓ వ్యక్తి అచేతనంగా ఉండటంతో మహంకాళీ ట్రాఫిక్ పోలీసులు మార్కెట్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు 108కు ఫోన్ చేయగా వారు అక్కడికి చేరుకుని పరిశీలించి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుడి చేతిపై పచ్చబొట్టు ఉందని, గుర్తించడానికి ఎలాంటి సమాచారం లభించలేదని, అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో ఒంటరిగా బాలుడు

● చైల్డ్ హోంకు తరలించిన పోలీసులు



మైనర్ బాలుడిని చేరదీసిన నాంపల్లి ఆర్పీఎఫ్ పోలీసులు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రైల్వేస్టేషన్‌లో ఒంటరిగా ఉన్న బాలుడిని నాంపల్లి ఆర్పీఎఫ్ పోలీసులు చైల్డ్ హోంకు తరలించారు. నాంపల్లి ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కల్పన తెలిపిన వివరాల ప్రకారం మియాపూర్‌కు చెందిన 7 ఏళ్ల బాలుడు మంగళవారం నాంపల్లి రైల్వేస్టేషన్‌లో ప్లాట్ ఫాం నంబరు-4లో ఒంటరిగా ఉండడంతో పెట్రోలింగ్ చేస్తున్న నాంపల్లి ఆర్పీఎఫ్ పోలీసులు బాబును చేరదీశారు. బాబు తల్లిదండ్రుల వివరాలను సేకరిస్తున్నారు. ప్రస్తుతం బాలుడిని చైల్డ్ హోంకు తరలిస్తున్నామని సీఐ తెలిపారు. బాబు తల్లిదండ్రులు వచ్చిన తర్వాత ఐడీ కార్డు పరిశీలించిన అనంతరం అప్పగిస్తామని సీఐ తెలిపారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి



అడ్డగుట్ట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్‌లో ఓ గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన గోపాలపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ మెట్రోస్టేషన్ వద్ద గుర్తుతెలియని 60 ఏళ్ల వ్యక్తి చనిపోయి ఉండగా సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

రైలుకింద పడి ఆత్మహత్య

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జెమ్స్ స్ట్రీట్ రైల్వేస్టేషన్‌లో ఓ గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటు చేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి తెలిపిన వివరాల ప్రకారం రాణిగంజ్ సమీపంలోని జెమ్స్ స్ట్రీట్ రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని 50 ఏళ్ల వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి ఎడమ చేతిపై నాగమ్మ పచ్చబొట్టు ఉందని రైల్వే పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అధ్వానంగా పబ్లిక్ టాయిలెట్స్

● హమాల్‌బస్తీ స్థానికుల అవస్థలు

● పట్టించుకోని అధికారులు

పద్మారావునగర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధి హమాల్‌బస్తీలోని పబ్లిక్ టాయిలెట్స్‌తో స్థానిక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఏళ్ల క్రితం నిర్మించిన టాయిలెట్స్ నిర్వహణ కరువై అధ్వానంగా మారాయి. ఒకవైపు దుర్గంధం మరోవైపు చెత్తా చెదారంతో నిండిన పరిసరాలు. తప్పని పరిస్థితుల్లో కొన్ని కుటుంబాలు ఇప్పటికీ వీటినే ఉపయోగించుకోవటం వారి దీన స్థితికి నిదర్శనంగా నిలుస్తోంది.



చెత్తతో నిండిన సిమెంటు నీటి తొట్టి

టాయిలెట్స్‌పై ఏర్పాటుచేసిన ఓవర్‌హెడ్ ట్యాంకుకు నీటి సరఫరా లేకపోవడం, నీటి వినియోగం కోసం నిర్మించిన సిమెంటు తొట్టి చెత్తా చెదారంతో నిండిపోయి దోమలకు స్థావరంగా మారుతోందని స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అసలే వరుస వర్షాల నేపథ్యంలో దోమలు పెరిగి స్థానికులు వ్యాధుల బారిన పడితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులెవరూ పట్టించుకోవడం లేదు, నిరుపేదల అవసరాలను అధికారులు గాలికొదిలి నిర్లక్షంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు టాయిలెట్స్‌ను, పరిసరాలను శుభ్రం చేయటానికి, నీటి సరఫరా పునరుద్ధరణకు చర్యలను చేపట్టాలని కోరుతున్నారు



అధ్వానంగా టాయిలెట్స్ లోపలికి వెళ్లే దారి

ఎమ్మెల్యే ఆదేశించినా

ఈ బస్తీలో గత సంవత్సరం వివిధ శాఖల అధికారులతో కలసి సనత్‌నగర్ శాసనసభ్యుడు తలసాని శ్రీనివాస్ యాదవ్ పర్యటించిన సందర్భంలో స్థానిక మహిళలు పబ్లిక్ టాయిలెట్స్ సమస్యను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనికి స్పందించిన ఆయన ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులను ఆదేశించినా నేటికీ సమస్య పరిష్కారం కాకపోవడం అధికారుల నిర్లక్షానికి అద్దం పడుతోంది.

వినియోగంలోకి తేవాలి



దుర్గంధ భరితంగా మారిన టాయిలెట్స్‌ను వినియోగంలోకి తేవాలి. అలాగే ఇళ్ల మధ్యలో టాయిలెట్స్ ఉండటం వల్ల చుట్టు పక్కల నివాసితులు దుర్గంధంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

- నేరేటి రవి, హమాల్‌బస్తీ

నీటి సరఫరా పునరుద్ధరించండి



అధ్వానంగా మారిన పబ్లిక్ టాయిలెట్ల పరిసరాలను శుభ్రపరచటానికి చర్యలు చేపట్టాలి. అలాగే నీటి సరఫరా కోసం తగిన ఏర్పాట్లను చేయాలి. టాయిలెట్స్ పక్కనే ఉన్న నీటి తొట్టిలోని చెత్తా చెదారాన్ని తొలగించి వినియోగించుకొనేలా చర్యలు చేపట్టాలి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని స్థానికుల ఇబ్బందులను దూరం చేయాలి.

- యాదగిరి, హమాల్‌బస్తీ నివాసి



చెత్త కుప్పలతో నిండిన టాయిలెట్ పరిసరాలు

జీవితాన్ని ప్రేమిద్దాం.. ఆత్మహత్యలను నివారిద్దాం

నేడు అంతర్జాతీయ ఆత్మహత్యల నివారణ దినం



రాంగోపాల్‌పేట్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జీవితాన్ని ప్రేమిద్దాం.. 2ఆత్మహత్యలను నివారిద్దాం, జీవితం ఒక గొప్ప వరం.. జీవించడం ఒక గొప్ప కళ అనే నినాదాలతో రోష్నీ (స్వచ్ఛంద సంస్థ) ఇరవై ఎనిమిదేళ్లుగా తనవంతు కృషి చేస్తుంది. ఈ సంస్థ ఇప్పటివరకు వేలాది మందిని ఆత్మహత్యల నుంచి కాపాడింది.

కారణాలు

ఓ మనిషి ఆత్మహత్య చేసుకోవాలనుకోవడంలో అనేక కారణాలు ఉంటాయి. అందులో మొదటిది మానసిక ఒత్తిడి. దీనితో పాటు ఒంటరితనం, వృద్ధాప్యం, కుటుంబ, ఆర్థిక సమస్యలు, అభద్రతాభావం, అనారోగ్య కారణాలు, దీర్ఘకాలిక రోగాలు, మానసిక సమస్యలు, వరకట్న వేధింపులు, గృహహింస, వివాహేతర సంబంధాలు, లైంగిక వేధింపులు, ఆత్మీయులు చనిపోయిన బాధలు, చదువు, ఉద్యోగ పరమైన ఒత్తిడులతో ఆత్మహత్యలకు ప్రయత్నిస్తుంటారు.

లక్షణాలు

ఎవ్వరినీ లెక్క చేయకపోవడం, ఒంటరిగా ఆలోచనల్లో ఉండడం, తీవ్ర నిరాశ, నిస్పృహ, ప్రతి చిన్న విషయానికి పెద్దగా స్పందించడం, తమపై తమకు విరక్తివంటి లక్షణాలు కనిపిస్తాయి.

ఆత్మహత్య లేని సమాజమే లక్ష్యం



ఆత్మహత్య లేని సమాజమే లక్ష్యంగా రోష్నీ స్వచ్ఛంద సంస్థ పనిచేస్తుంది. మానసికంగా కృంగిపోయిన వారికి ధైర్యాన్ని, ఓదార్పును అందించి వారి బాధను పంచుకుంటూ వారికి వారి భవిష్యత్తుపై ఆశను చిగురింప చేసి ఆత్మహత్య ఆలోచన నుంచి దృష్టి మరల్చి బతుకుపై ఆశను నింపుతూ సేవలను అందిస్తున్నాం.

విద్యారెడ్డి, రోష్నీ వాలంటీర్

వారికి కావాల్సింది

కాస్తంత ఓదార్పు, మానసిక ఆసరా, నీకు నేను ఉన్నాను అనే భరోసా, వారి బాధలను ఓపికగా విని వారినే దానికి పరిష్కారం కనుగొనేలా చేయడం. 2020 ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం ప్రతి ఏటా ప్రపంచవ్యాప్తంగా 8 లక్షల మంది బలవన్మరణాలు జరుగుతున్నాయి. అందులో అధిక శాతం 15 నుంచి 29 ఏళ్ల వయస్సు వారు ఉన్నారు. అదే భారత దేశంలో రోజుకు 381 ఆత్మహత్యలు జరుగుతున్నాయి. అందులో మహారాష్ట్ర 13.60 శాతంతో మొదటి స్థానంలో ఉండగా తెలంగాణ 5.5శాతంతో ఆరో స్థానంలో ఉంది.



బోయినపల్లి పోలీసులను అభినందిస్తున్న రాణా ప్రతాప్ యువసేన ప్రతినిధులు

బోయినపల్లి పోలీసులకు సత్కారం

బోయినపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా, పటిష్టమైన భద్రతా ఏర్పాట్లతో నిర్వహించినందుకు బోయినపల్లి పోలీసులను రాణా ప్రతాప్ యువసేన కమిటీ సభ్యులు అభినందించారు. ముఖ్యంగా ఓల్డ్ బోయినపల్లి, దుబాయి గేట్, హస్మత్‌పేట్ చౌరాస్తాలలో బోయినపల్లి పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేసి సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిఘా ఉంచి నిమజ్జన వేడుకలను నిర్వహించారు. ఈ నేపథ్యంలో రాణా ప్రతాప్ యువసేన కమిటీ సభ్యులు, పీస్ కమిటీ సభ్యులు బోయినపల్లి పోలీసులను కలిసి శుభాకాంక్షలు తెలుపుతూ ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు, డీఐ సర్దార్ నాయక్, ఎస్‌ఐలు శివశంకర్, నందిత, గణేష్ గౌడ్, అవినాష్‌లను ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జంపన రవి, రాము గౌడ్, అనిల్ గౌడ్, దయానంద్, గోపి, వేణు, నాగరాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో రాణిస్తున్న మాస్టర్ అవనీష్



అవనీష్‌ను సన్మానిస్తున్న కోచ్

తిరుమలగిరి సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బోయిన్‌పల్లి సెయింట్ పీటర్స్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న అవనీష్ బొలిశెట్టి, మార్షల్ ఆర్ట్స్‌లో మరో మెడల్ సాధించాడు. తాజాగా ఉత్తరప్రదేశ్‌లోని అమినిర్ విషన్ స్కూల్‌లో 7న జరిగిన సీబీఎస్సీ నేషనల్ టైక్వాండో పోటీలో అండర్ 17లో అవనీష్ బ్రాంజ్ మెడల్‌ను సాధించాడు. తిరుమలగిరిలోని కొంబాట్ టైక్వాండో అండ్ స్పోర్ట్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్న అవనీష్ జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొంటూ సత్తా చాటుతున్నాడు. ఈ సందర్భంగా మంగళవారం తిరుమలగిరిలోని శిక్షణ శిబిరం వద్ద కోచ్ నరసింహ మెడల్ సాధించిన అవనీష్‌ను, అతడి తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు. ఇప్పటివరకు గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ నిర్వహించిన సీఎం కప్‌లో గోల్డ్ మెడల్‌తో పాటు రాష్ట్రస్థాయిలో 15 గోల్డ్ మెడల్స్ సాధించి సీబీఎస్ఈ నేషనల్ టైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో మొదటిసారి నేషనల్ లెవెల్‌లో బ్రాంజ్ మెడల్ సాధించడం ఎంతో సంతోషంగా ఉందని అవనీష్ ఆనందాన్ని వ్యక్తం చేశాడు.



మర్యాద పూర్వక కలయిక

రాష్ట్రమంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును మంగళవారం బోయినపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాగీరు ఆనంద్ బాబు మర్యాద పూర్వకంగా కలిశారు. బోయినపల్లి మార్కెట్ కార్యకలాపాలు, కొత్తగా చేపట్టనున్న అభివృద్ధి పనుల గురించి ఆయనకు వివరించారు.

- సికింద్రాబాద్, ఆంధ్రజ్యోతి



శుభాకాంక్షలు

బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా జీహెచ్‌ఎంసీ మాజీ మేయర్ బండ కార్తీకారెడ్డి నియామకమైన సందర్భంగా బీజేపీ తార్నాక డివిజన్ అధ్యక్షుడు బండారి ఉపేందర్ యాదవ్‌తో పాటు, ఆ పార్టీ మహిళా నాయకురాళ్లు మంగళవారం ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ మహిళా నాయకురాళ్లు, అనిత, అనూష, సరోజ, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

- తార్నాక, ఆంధ్రజ్యోతి

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి



దిష్టిబొమ్మతో రోడ్డుపై నిరసన చేస్తున్న ఏబీవీపీ నాయకులు

రెజిమెంటల్‌బజార్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని ఏబీవీపీ సికింద్రాబాద్ జిల్లా కన్వీనర్ చెర్క బాలకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం సికింద్రాబాద్ క్లాక్ టవర్ వద్ద సీఎం దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రూ.8500 కోట్ల బకాయిలను విడుదల చేస్తామని ప్రకటించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 21 నెలలు అవుతున్నా స్పందన లేదని అన్నారు. కనీసం విద్యాశాఖ మంత్రిని కూడా నియమించకుండా విద్యాశాఖను స్వయంగా నేనే చూస్తున్నాను అని గొప్పలు చెప్పుకుంటున్న సీఎంకు ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు కనపడటం లేదా అని ప్రశ్నించారు. ఉన్నత చదువులు చదవడానికి కాలేజీల్లో సర్టిఫికేట్లు అడిగితే ఫీజులు చెల్లించమని అడుగుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ కాలేజీలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. మార్కెట్ ఇన్‌స్పెక్టర్ రాంచందర్ ధర్నా చేస్తున్న విద్యార్థి నాయకులకు నచ్చచెప్పడంతో ధర్నా విరమించారు. ఎస్సైలు నరేష్, రవి, మాధవి, ట్రాఫిక్ ఎస్సై మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

బౌద్ధనగర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బీసీ ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పి.రవిప్రసాద్‌గౌడ్ డిమాం డ్ చేశారు. మంగళవారం డీఎస్‌ఎస్ భవన్‌లో వెనుకబడిన తరగతుల కమిషనర్ బాల మాయదేవీని కలిసి వినతిపత్రం సమర్పించారు. నగరంలో, విదేశాల్లో విద్యను అభ్యసించడానికి బీసీ కార్పొరేషన్ ద్వారా దరఖాస్తు చేసుకొని అనేక మాసాలుగా తనిఖీలు పూర్తయినప్పటికీ ఇంతవరకు స్కాలర్‌షిప్‌లు అందజేయటంలో జాప్యం జరుగుతుందని రవిప్రసాద్‌గౌడ్ అన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు అందజేయాలని కోరారు.

గ్రూప్-1 ఫలితాలపై హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు



సమావేశంలో తెలంగాణ నిరుద్యోగ జేఏసీ ప్రతినిధులు, నిరుద్యోగులు

పంజాగుట్ట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 ఫలితాలపై హైకోర్టు తీర్పు రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదని పలువురు నిరుద్యోగులు అన్నారు. స్థానికసంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. లేకపోతే స్థానిక ఎన్నికల్లో తమ సత్తా ఏమిటో కాంగ్రెస్ ప్రభుత్వానికి చూపుతామని హెచ్చరించారు. ఆర్థిక శాఖ అనుమతి ఇచ్చినా నోటిఫికేషన్లు ఎందుకు ఇవ్వడం లేదు, ఖాళీలు ఎందుకు భర్తీ చేయడం లేదని వారు ప్రశ్నించారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో 'రెండు లక్షల ఉద్యోగాల సాధన కోసం నిరుద్యోగుల పోరుబాట' అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. జేఏసీ అధ్యక్షుడు మోతిలాల్ నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. నిరుద్యోగ యువత మీద రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని మండిపడ్డారు. స్థానికసంస్థల ఎన్నికలకు ముందే ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలన్నారు. ఉద్యోగాల కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఝాన్సీ, ఎడపాక రవి, బండారి రాజు, కృష్ణమూర్తి, ఉమ, వర్ధన్, గోపీచంద్, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు సన్మానం చేసిన బీజేపీ నేతలు

ఉపాధ్యాయులకు బీజేపీ నేతల సన్మానం

అడ్డగుట్ట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : టీచర్స్ డే సందర్భంగా మంగళవారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న 20 మంది టీచర్లకు బీజేపీ అడ్డగుట్ట డివిజన్ అధ్యక్షురాలు గాజుల సౌందర్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విద్యాశాఖ డిప్యూటీ ఐఓఎస్ అధికారి మదన్‌మోహన్‌రెడ్డి, బీజేపీ నేతలు గెల్లు ఉదయ్ యాదవ్, గోగుల స్వామి, వీరేశం, శివలింగంలు పాల్గొన్నారు.



గురుపూజోత్సవ వేడుకలు

సీతాఫల్‌మండిలో గురుపూజోత్సవ వేడుకలు శ్రీసాయి విద్యాలయ హైస్కూలులో మంగళవారం ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో ముషీరాబాద్ మండల ఉప విద్యాశాఖాధికారి శ్రవణ్ కుమార్, డిప్యూటీ ఐఏస్ ఎం. స్వర్ణలత, తెలంగాణ రాష్ట్ర ట్రస్మా, స్కూలు కరస్పాండెంట్ వెంకటేష్, మంచాల రఘు, శ్రీకాంత్‌లు పాల్గొని ఘనంగా సన్మానించారు.

- బౌద్ధనగర్, ఆంధ్రజ్యోతి